క్లుప్తంగా

స్నేహితుడి కుటుంబానికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయం అందజేస్తున్న బాల్య మిత్రులు

కందుకూరు: తమతో చదువుకున్న బాల్య మిత్రుడు మృతి చెందగా.. అతడి స్నేహితులు ఆ కుటుంబానికి అండగా నిలిచారు. మండల పరిధి నేదునూరు జిల్లా పరిషత్ పాఠశాలలో 1998వ సంవత్సరంలో పదో తరగతి చదువుకున్న ధన్నారంకు చెందిన మంద శేఖర్ ఇటీవల మృతి చెందాడు. విషయం తెలుసుకున్న నాటి మిత్రులు అందరూ ఏకమై.. రూ.50 వేల నగదును ఆదివారం శేఖర్ కుటుంబీకులకు అందజేశారు.

బద్దారికి జన్మదిన శుభాకాంక్షలు



వెంకటేశ్వర్‌రెడ్డిని సత్కరిస్తున్న మధుయాష్కీ గౌడ్

చైతన్యపురి: తెలంగాణ రెడ్డి సంఘాల కన్వీనర్ బద్దారి వెంకటేశ్వరరెడ్డి జన్మదిన వేడుకలు చైతన్యపురి హనుమాన్‌నగర్‌లో జరిగాయి. పీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీ గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై వెంకటేశ్వరరెడ్డితో కేక్ కట్ చేయించారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో రెడ్డి సంఘాల నాయకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు శశిధర్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, ఆయన అభిమానులు, స్నేహితులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు లబ్ధి

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సీఎం రిలీఫ్ ఫండ్ ఎల్‌ఓసీ పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

చైతన్యపురి: ముఖ్యమంత్రి సహాయనిధితో ఎంతో మంది పేదలకు లబ్ధి చేకూరుతోందని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. గడ్డిఅన్నారం డివిజన్ వీవీనగర్‌లో నివాసం ఉండే చంద్రమతి కొంత కాలంగా కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతున్నారు. ఆపరేషన్ చేయించుకొనేందుకు ఆర్థిక స్థోమత లేక పోవటంతో ఎమ్మెల్యేను సంప్రదించారు. ఆయన సీఎం రిలీఫ్ ఫండ్‌కు దరఖాస్తు చేయించగా, రూ. 1.5 లక్షలు మంజూరయ్యాయి. ఇందుకు సంబంధించిన ఎల్‌ఓసీ చెక్కును బాధితురాలి భర్త రామకృష్ణకు ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సీఎం సహాయ నిధి పేదలకు ఓ వరం వంటిదన్నారు. కార్యక్రమంలో మన్సూరాబాద్ మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, నాయకులు అనంతుల రాజిరెడ్డి, చాతిరి మధుసాగర్ తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా లోకల్ 31, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 60, కాకర 38, బీర 40, క్యాలీఫ్లవర్23, క్యాబేజీ 21, క్యారెట్ 40. దొండ 18, ఆలు 34, ఉల్లి 32, గోకర 40, దోస 28, సొర 11, పొట్ల 18, అరటి 09, చిక్కుడు 50, ఆర్వి 40, మునగ 50, చిలగడదుంప 45, బీట్‌రూట్ 23, కీర 25, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యాప్సికమ్ 65.ఈ ధరలు సోమవారం 9 గంటల వరకు మాత్రమే అమలులో ఉంటాయి.

సన్నాయి, డోలు అందజేత

తలకొండపల్లి: బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు శంకర్ ఆధ్వర్యంలో రూ.85వేలు విరాళం సేకరించి నాయి బ్రాహ్మణులకు సన్నాయి, డోలు అందజేశారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ నాయి బ్రాహ్మణులు పడుతున్న ఇబ్బందుల దృష్ట్యా దాతలచే విరాళాలు సేకరించారన్నారు. దీంతో ఆదివారం పులిమామిడి సీతారాంరెడ్డి, జనార్దన్‌రెడ్డి, కమలాకర్‌లు అందజేసిన రూ.85వేలతో శంకర్ ఆధ్వర్యంలో దేవుని పడకల్ శ్రీ వెంకటేశ్వర ఆలయంలో నాయి బ్రాహ్మణులకు సన్నాయి, డోలు అందజేశారు. ఆలయ పూజారి రామాచారి, మధుసూదన్‌రెడి, జంగయ్య, రమేష్, వేణు, మహేష్, మాజీ సర్పంచ్ కుమ్మరి శంకర్, స్వామిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధితో అధిక దిగుబడులు



విత్తన శుద్ధిని పరిశీలిస్తున్న రైతులు



అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న రైతులు

మహేశ్వరం ఏడీఏ సుజాత



మహేశ్వరం: నాణ్యమైన విత్తనాలు కొనుగోలు చేసినా తొలి దశలో నేల, విత్తనం ద్వారా సంక్రమించే తెగుళ్లు, రసం పీల్చే పురుగులను నియంత్రించాలంటే శుద్ధి ప్రక్రియ తప్పనిసరని మహేశ్వరం సహాయ వ్యవసాయ సంచాలకులు సుజాత తెలిపారు. చీడపీడలు వ్యాప్తి చెందిన తర్వాత సస్య రక్షణ పద్ధతులు పాటించడం కన్న వాటిని ముందుగానే విత్తన శుద్ధితో అదుపు చేసుకోవాలని, దీంతో పంట నాణ్యత పెరగడమే కాక అధిక దిగుబడి పెరగడానికి దిగువ పద్ధతులను పాటించాలని సూచించారు.

లాభాలు..

పంట సాగు చేస్తున్న రైతులు విత్తన శుద్ధి క్రమం తప్పకుండా చేయాల్సి ఉంటుంది. ఈ విధానంతో మొలక శాతం పెరిగి సాంద్రత సిఫార్సు మేరకు ఉంటుంది. తొలి దశలో ఆశించే పురుగులు, తెగుళ్ల బారి నుంచి పంటలను కాపాడుతుంది. దీంతో మొక్క ఏపుగా పెరగడానికి అవకాశం ఉంటుంది. చీడపీడల ఉధృతిని తగ్గించి తర్వాతి దశలో రసం పీల్చు పురుగులు, వైరస్ తెగుళ్ల నుంచి పంటలను కాపాడుకోవచ్చు. రైజోబియం వలన నత్రజని స్థిరీకరణ జరుగుతుందని సూచించారు. అంతేకాక వాతావరణ కాలుష్యం తగ్గి మిత్ర పురుగులు రక్షించబడుతాయని వివరించారు.

నేలసారం..

నేల శుద్ధికి 100 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేప పిండి, 2 కిలోల ట్రై కోడెర్మా విరిడిని తీసుకుని నీడలో బాగా కలియబెట్టాలి. ఈ మిశ్రమాన్ని వారం పాటు ఉదయం, సాయంత్రం నీటితో తడుపుతూ మాగబెట్టాలి. పొలంలో తేమ ఉన్నప్పుడు ఒక ఎకరం విస్తీర్ణంలో చల్లుకోవాలి.

వరి సాగుకు..

మెట్ట వరి సాగుకు కిలో విత్తనానికి 3 గ్రాముల కార్బండిజమ్ అనే మందును పట్టించి, ఆరబెట్టి విత్తుకోవాలి. నారుమడి పద్ధతిలో సాగు చేయాలనుకుంటే రైతులు కిలో విత్తనానికి 1 గ్రాము కార్బండిజమ్ మందును కలిపి 24 గంటలు నీళ్లలో నానబెట్టాలి. అనంతరం మండెకట్టి ముక్కు పగిలిన విత్తనాన్ని విత్తుకోవాలి.

పత్తి విత్తనం..

బ్యాక్టీరియా వల్ల నల్ల మచ్చ ఆశించే ప్రాంతాల్లో లీటర్ నీటిలో 100 మిల్లి గ్రాముల వైసన్ లేదా



విత్తన శుద్ధి

ప్లాంటామైసీన్, గ్రామ్ లైటాన్స్ కలిపిన ద్రావణంలో శుద్ధి చేసిన విత్తనాలను 6–8 గంటలు నానబెట్టి ఆ తర్వాత ఆరబెట్టుకొని విత్తుకుంటే ప్రయోజనం ఉంటుంది.

కంది: కిలో విత్తనానికి 3 గ్రాముల కాప్టాన్ పట్టించాలి. ఆ తర్వాత 10 గ్రాముల ట్రై కోడెర్మా విరిడిని పట్టించాలి. అరగంట తర్వాత 200–400 గ్రాముల రైజోబియం కలుపుకొని విత్తుకోవాలి.

జొన్న..

కిలో జొన్న విత్తనానికి 3 గ్రాముల మాంజోజెబ్, 4 గ్రాముల థయోమిథాక్సమ్ పట్టించి అరగంట నీడలో ఆరబెట్టి విత్తుకోవాలి.

పొదుపు సంఘం వార్షికోత్సవం



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఆంజనేయులు

పహాడీషరీఫ్: జల్‌పల్లి మున్సిపాలిటీలోని శ్రీరాం కాలనీలో నవకార్మిక ప్రగతి సొసైటీ పొదుపు సంఘం 12వ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. 12 ఏళ్ల నుంచి కొనసాగిన ఆర్థిక లావాదేవీలపై ఈ సందర్భంగా సభ్యులు చర్చించారు. సంఘంలో నూతనంగా అమలు చేయనున్న పథకాల విషయమై ప్రస్తావించారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడిగా నవపేట ఆంజనేయులు, ముఖ్య సలహాదారుడిగా రాహులగల్ల యాదగిరి, ప్రధాన కార్యదర్శిగా నర్సింహా యాదవ్, కోశాధికారిగా బాస శంకర్, ఉపాధ్యక్షుడిగా సత్తమ్మ, సహాయ కార్యదర్శిగా కావలి మహేశ్, పాలక వర్గ సభ్యులుగా వి.సునిల్, రంగం మహేశ్, స్వరూప, కె.శ్రీకాంత్‌లు ఎన్నికయ్యారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

బడంగ్‌పేట్: కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఆదివారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతకు పలు కాలనీవాసులు వినతిపత్రాలు సమర్పించారు. కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్ న్యూతిరుమలనగర్, హనుమాన్‌నగర్, అరవింద్‌నగర్ చెందిన కాలనీసులు మహేశ్వరం నియోజకవర్గం యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మేయర్‌ను కలిసి విన్నవించారు. కాలనీల్లో పేరుకుపోయిన డ్రైనేజీ, రోడ్లు, వాటర్, వీధిలైట్లు ఇతర మౌలిక వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాలనీవాసులు పడుతున్న ఇబ్బందులు గమనించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో పలు కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



మేయర్‌కు వినతిపత్రం ఇస్తున్న పలు కాలనీల వాసులు

గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతం



అభ్యర్థులను తనిఖీ చేసి పరీక్ష కేంద్రంలోకి పంపిస్తున్న సిబ్బంది

మీర్‌పేట: గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ఆదివారం మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రశాంతంగా జరిగింది. మొత్తం 8 కేంద్రాలలో పరీక్ష నిర్వహించారు. 4600 మంది అభ్యర్థులకు గాను 3713 మంది పరీక్షకు హాజరు కాగా, 947 మంది గైర్హాజరైనట్లు మీర్‌పేట ఇన్‌స్పెక్టర్ కాశీవిశ్వనాథ్ తెలిపారు. నిమిషం ఆలస్యంగా వచ్చిన కారణంగా నలుగురు అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి సిబ్బంది అనుమతించకపోవడంతో వారు నిరాశతో వెనుదిరిగారు. పరీక్షా కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని సీఐ తెలిపారు.

ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్య

మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రభుత్వ బడుల్లోనే నాణ్యమైన విద్య అందుతుందని, ప్రతిఒక్కరూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఆదిబట్ల మున్సిపాలిటీ చైర్మన్ మర్రి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలోని ఆదిబట్ల టౌన్‌లో బడిబాట నిర్వహించారు. విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ బడులను బలోపేతం చేయడానికి నిరంతరం కృషి చేస్తుందన్నారు. ప్రభుత్వం విద్యా విధానంలో నూతన మార్పులు తీసుకొస్తుందని తెలిపారు. అందులో భాగంగానే అమ్మ ఆదర్శ పాఠశాలలను తీసుకొచ్చి అభివృద్ధి చేసిందన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ కోరే కళమ్మ, కోఆప్షన్ సభ్యులు గోపాల్‌గౌడ్, పెద్దలు పాండురంగారెడ్డి, రాజు, పాఠశాల చైర్మన్ మమత, ప్రధానోపాధ్యాయులు వర్కాల పరమేష్, ఉపాధ్యాయులు బుచ్చయ్య, రామ్మోహన్, జంగయ్య, విజయలక్ష్మి, బబ్లీ, ఇందిరా, ఎస్‌ఎస్‌జీ సభ్యులు మాధురి, అంగన్‌వాడీ టీచర్ బేబీ, సూజాత తదితరులు పాల్గొన్నారు .

మొండిగౌరెల్లిలో బీజేపీ శ్రేణుల సంబురాలు



మొండిగౌరెల్లి గ్రామంలో మిఠాయిలు పంచుకుంటున్న పార్టీ నాయకులు

యాచారం: కేంద్రంలో నరేంద్రమోదీ వరుసగా మూడోసారి ప్రధానిగా ప్రమాణస్వీకారం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తు ఆదివారం రాత్రి మొండిగౌరెల్లి గ్రామంలో బీజేపీ శ్రేణులు సంబరాలు నిర్వహించారు. బీజేపీ మండల అధ్యక్షుడు తాండ్ర రవీందర్ ఆధ్వర్యంలో బొద్రాయి యూత్ కార్యాలయం వద్ద బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకున్నారు. నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం సురక్షితంగా, అభివృద్ధి చెందుతుందనే భరోసాతోనే ప్రజలు మూడోసారి అవకాశం కల్పించారని రవీందర్ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యుడు మేకల యాదగిరిరెడ్డి, సీనియర్ నాయకులు కొలన్ మల్లారెడ్డి, మర్పల్లి మల్లేష్ యాదవ్, కుంచారం సందీప్ రెడ్డి, ప్రతాప్‌రెడ్డి, కృష్ణయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

అబ్దుల్లాపూర్‌మెట్: భారత ప్రధానిగా నరేంద్ర మోడీ వరుసగా మూడో సారి ప్రమాణస్వీకారం చేయడంతో ఆదివారం బీజేపీ నేతలు సంబురాలు జరుపుకున్నారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండల కేంద్రంలో ఆ పార్టీ మండల అధ్యక్షుడు బండిగారి విష్ణుగౌడ్, కవాడిపల్లిలో మండల పార్టీ ప్రధాన కార్యదర్శి బొడిగె సురేష్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో నేతలు బాణాసంచా కాల్చి స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో వీరస్వామి, జంగమయ్య, పాపయ్య, రమాదేవి, సురేఖా, శ్రీలత, యాదగిరి, రామకృష్ణ, కట్టా సాయి, శ్రావణ్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

రైస్ మిల్లును తీసేయండి

కాలనీ వాసుల డిమాండ్



మాట్లాడుతున్న కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు

హయత్‌నగర్: అన్మగల్ హయత్‌నగర్‌లో ఉన్న ఓ రైస్ మిల్లు కారణంగా తాము తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నామని, వెంటనే దానిని ఇక్కడి నుంచి తీసేయండి డివిజన్‌లోని ఆలూరి కాలనీ, బ్లూసమ్ సిటీ, స్వగృహ కాలనీల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. ఆదివారం సమావేశమైన ఆయా కాలనీల సంక్షేమ సంఘాల నాయకులు మాట్లాడుతూ... నివాసాల మధ్య ఉన్న ఈ రైస్‌మిల్లు నుంచి వస్తున్న దుమ్ము, ధూళి వల్ల తాము శ్వాసకోశ వ్యాధులతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలను ఎదుర్కొంటున్నామని తెలిపారు. రాత్రింబవళ్లు రైస్ మిల్లుకు భారీ వాహనాలు తమ కాలనీల రోడ్లపై నుంచి రాకపోకలు సాగిస్తుండటంతో శబ్ద, వాయు కాలుష్యం ఏర్పడుతోందని, తాగునీటి, డ్రైనేజీ పైప్‌లైన్లు పగిలిపోతున్నాయని వారు వాపోయారు. రైస్ మిల్లు కారణంగా ఎదుర్కొంటున్న సమస్యలను సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని వారు ఆరోపించారు. రైస్ మిల్లును అధికారులు ఇక్కడి నుంచి తరలించకుంటే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆలూరి కాలనీ ప్రెసిడెంట్ ఆలూరి, బ్లూసమ్ సిటీ అధ్యక్షులు జైభారత్‌రెడ్డి, నాయకులు శ్రీనివాస్, హర్షవర్ధన్‌రెడ్డి, రాంచంద్రారెడ్డి, ప్రభాకర్, కృష్ణ, విజయభాస్కర్ రెడ్డి, కృష్ణారెడ్డి, అక్షయ్ తదితరులు పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన మైసిగండి ఆలయం

కడ్తాల్: కడ్తాల్ మండల పరిధిలోని మైసిగండి గ్రామంలో మైసమ్మ దేవతను ఆదివారం భక్తులు వేలాదిగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. బుధవారం నుంచి పాఠశాలలు పునః ప్రారంభమవుతుండటంతో విద్యార్థులు, తల్లిదండ్రులు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మైసిగండి ఆలయ పరిసరాలు భక్తజనంతో నిండిపోయింది. క్యూలైన్లలో గంటల తరబడి వేచి అమ్మవారిని దర్శించుకున్నారు.

జూన్ రెండో వారంలో పూరీ జగన్నాథ్ రథయాత్ర



మహర్షింగ్ ప్రభును సత్కరిస్తున్న స్థానికులు

ఆమనగల్లు: ఆమనగల్లు పట్టణంలో ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో జూన్ రెండోవారంలో పూరీ జగన్నాథ్ రథయాత్ర నిర్వహించాలని నిర్ణయించారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ హనుమాన్ దేవాలయంలో ఆదివారం పూరీ జగన్నాథ్ రథయాత్ర నిర్వహణపై సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హైదరాబాద్ కూకట్‌పల్లిలోని ఇస్కాన్ టెంపుల్ అధ్యక్షుడు మహర్షింగ్ ప్రభు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కూకట్‌పల్లి ఇస్కాన్ టెంపుల్ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాలలో పూరీ జగన్నాథ్ రథ యాత్ర నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు మహర్షింగ్ ప్రభు వివరించారు. రథయాత్ర నిర్వహణ కోసం ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. రథయాత్రలో పెద్ద ఎత్తున భక్తులు, ప్రజలు పాల్గొనేలా చూడాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా మహర్షింగ్ ప్రభును ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాపిశెట్టి రాము, వీరబొమ్మ రామ్మోహన్, ఎంగలి బాలకృష్ణ, శ్రీశైలం, నర్సింహా, నటరాజు యాదయ్య, దొంతు విశ్వనాదం, అల్లాజీ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం

ఇబ్రహీంపట్నం రూరల్: యాచారం మండలం చిన్నతుండ్ల జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల 1993–94 పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఇబ్రహీంపట్నంలో జరిగింది. చిన్ననాటి విద్యాబుద్ధులు చెప్పిన గురువులను పూలమాలలు వేసి శాలువ కప్పి సత్కరించారు. పూర్వ విద్యార్థులందరూ గురువుల యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. 30 ఏళ్ల అనంతరం వారంతా ఒకే వేదిక్పై దర్శనమివ్వడంతో వారి సంతోషానికి అవధులు లేకుండా పోయాయి. వారి యోగక్షేమాలను ఒకరినొకరు పంచుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు, విద్యార్థులు జక్కుల వెంకటేశ్, అంకని ఈశ్వర్, బి.వెంకటేశ్వర్లు, ఆంజనేయులు, రాజేష్, రాజిరెడ్డి, యశోద, ప్రతిభ, శ్రీమన్నారాయణ, సంజీవ పాల్గొన్నారు.

తలకొండపల్లిలో..

తలకొండపల్లి: మండల పరిధిలోని చంద్రధన జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2002–03 బ్యాచ్ 45 మంది పూర్వ విద్యార్థులు మండలంలోని ఓ ఫంక్షన్ హాల్లో సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. తమ కుటుంబ సభ్యులతో కలిసి తరలి వచ్చారు. ఒకరినొకరు చేయిచేయి కలుపుకుంటూ ఆప్యాయంగా పలుకరించుకున్నారు. తమ కుటుంబ సభ్యులను పరిచయం చేస్తూ, తాము చేసే వృత్తి పనులను గూర్చి తెలుసుకున్నారు. ఆనాటి చిలిపి చేష్టలను గుర్తు చేసుకున్నారు. నాటి జ్ఞాపకాలు, మధురస్మృతులను నెమరువేసుకున్నారు. తాము చదివిన పాఠశాలకు సహాయం చేద్దామని తీర్మాణించుకున్నారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా, సరిత, చెన్నయ్య, ప్రసన్న, మహేందర్, శ్రీలత, శివశంకర్, శేఖర్, గీత, రజిత, తదితరులు పాల్గొన్నారు.

యాచారంలో..

యాచారం: మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం జరిగింది. యాచారం ఉన్నత పాఠశాలకు చెందిన 2001–02 పదో తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులతో సమ్మేళనం నిర్వహించారు. పాఠశాల రోజుల్లో చేసిన చిలిపిచేష్టలు, అల్లరి పనులను విద్యార్థులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ ఉపాధ్యాయులు ఏ. కృష్ణ, కృష్ణయ్య, నారాయణరెడ్డి, సత్యం, రమేష్, చంద్రమౌళి, వెంకటలక్ష్మీ, పద్మతో పాటు పూర్వ విద్యార్థులు మారోజ్ ప్రదీప్‌చారి పాల్గొన్నారు.

ఆమనగల్లు: పట్టణంలోని బాలుర ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 30 ఏళ్లక్రితం చదువుకున్న స్నేహితులంతా ఒక్కచోట కలుసుకుని ఆత్మీయంగా గడిపారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటనర్సింహా గార్డెన్స్‌లో ఆదివారం ఆమనగల్లు బాలుర ఉన్నత పాఠశాలలో 1994–95 ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థులు పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. దాదాపు 30 ఏళ్ల తరువాత కలుసుకున్న స్నేహితులంతా ఒకరినొకరు యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము ఏర్పాటు చేసుకున్న స్నేహహస్తం ఫౌండేషన్ ద్వారా మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహించాలని తీర్మాణించారు. ఈ సందర్భంగా 42 సార్లు రక్తదానం చేసిన ఎస్‌ఎస్‌సీ బ్యాచ్ విద్యార్థి సిరందాస్ జగదీశ్వర్‌ను ఘనంగా సత్కరించారు. అలాగే ఎస్‌ఎస్‌సీ, ఇంటర్‌లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరికి ఒక మొక్కను బహుకరించి ఇంటి ఆవరణలో నాటుకుని సంరక్షించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు హుజూర్‌నగర్ సీఐ గజ్జె చరమందరాజు, స్నేహహస్తం ఫౌండేషన్ అధ్యక్షుడు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి పెరికేటి యాదయ్య, ఉపాధ్యక్షుడు సింగంపల్లి శ్రీను, కోశాధికారి యాదయ్య, సభ్యులు వెంకటేష్, జహంగీర్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.



ఇబ్రహీంపట్నం రూరల్: పదోతరగతి బ్యాచ్ విద్యార్థులు



ఆమనగల్లు: పూర్వ విద్యార్థుల సమ్మేళనంలో 1994-95 బ్యాచ్ విద్యార్థులు